క్లుప్తంగా

గ్రంథాలయ వారోత్సవాలు



బచ్చన్నపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గ్రామాల్లోని వీధుల్లో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, అసిస్టెంట్ కార్యదర్శి రామదాసు, మండల నోడల్ అధికారి డీపీఎల్ఎన్ మూర్తి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌లకు జీతం చెల్లించాలి

జనగామ రూరల్: గత ఆరు నెలలుగా ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీస్ (ఓపీఎస్)లకు జీతాలు లేవని, బకాయిలు చెల్లించి ఆదుకోవాలని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీపీఓ రంగాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి వేతనాలు లేవని కుటుంబాలు గడవడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. నాయకులు సాయిబాబా, సంతోష్‌కుమార్, అనిల్ రాథోడ్, ఓపీఎస్‌లు పాల్గొన్నారు.

'నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టిస్తున్న కడియం, రాజయ్య'

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజయ్య, కడియం దొందూదొందే అని ఎద్దేవా చేశారు. ఇద్దరు నేతలు టామ్ అండ్ జెర్రీ ఆట ఆడుతూ నియోజకవర్గ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఇద్దరు ఉన్నతస్థానంలో ఉండి చౌకబారు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. సీటు కోసం కొట్లాడటం కాదని, అభివృద్ధి చేయడంలో పోటీపడాలని ఆయన డిమాండ్ చేశారు.

'దొందూదొందే'

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రానికి డిప్యూటీ సీఎంలుగా పనిచేసిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య దొందూదొందేనని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్ట రజనీకాంత్ అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల తమ హయాంలో వచ్చిందని ఇద్దరూ గొప్పలు చెప్పుకుంటున్నారని, వాస్తవానికి దేవాదుల సృష్టికర్త, రూపకర్త, అభివృద్ధి కర్త ఉమ్మడి ఏపీ మాజీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని, వారు చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టు ప్రసాద్‌బాబు, స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గడ్ మండల పార్టీ అధ్యక్షులు మాదిరెడ్డి ధర్మారెడ్డి, బత్తిని ఎల్లయ్యగౌడ్, రాపర్తి యాకయ్య, టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాజ్యం, నాయకులు మేకల రమేష్, సీహెచ్.సోమనర్సయ్య, రమేష్, సిద్దిరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట కబ్జాను నిలువరించాలి

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరు పరిధి కొత్తకుంట చెరువు కట్టతో సహా శిఖం కబ్జాకు గురికాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్యకార్మికులు, ఆయకట్టరైతులు తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యకార్మికుల సంఘం అధ్యక్షుడు భువనగిరి యాదగిరి, పంగ రాములు మాట్లాడుతూ సంపంగి రాములు అనే వ్యక్తి చెరువు కట్టను పొక్లెయిన్‌తో సగం వరకూ తొలగించి శిఖం భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు, ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిందని వాపోయారు. కొత్తకుంట చెరువు పరిధి 50 ఎకరాల ఆయకట్టు రైతుల జీవనోపాధితోపాటు చేపల పెంపకానికి విఘాతం కల్పించే చర్యలను నివారించి సదరు వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకార్మికుల సంఘం నాయకులు బోనగిరి నగేష్, ఎల్లయ్య, సోమల్లయ్య, రేగుల శ్రీను, ఆయకట్ట రైతులు ఊడుగుల సోమయ్య,వీరయ్య, చిర్ర నర్సయ్య, రవి, లక్ష్మయ్య, సంపంగి యాదయ్య, ఓర్సు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో భర్త రిమాండ్

రఘునాథపల్లి: భార్యను హత్య చేసిన కేసులో భర్తను రిమాండ్ చేసినట్లు జనగామ రూరల్ సీఐ ఆర్.సంతోష్ మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 7న అశ్వరావుపల్లిలో పల్లెపు సత్తయ్య కుటుంబ కలహాలతో భార్య సమ్మక్క (38)ను గడ్డపారతో తలపై బాదడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు వెంటనే సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సత్తయ్యపై అదే నెల 13న పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమ్మక్క 15న మృతిచెందింది. హత్యాయత్నం కేసును హత్య కేసుగా నమోదు చేసి మంగళవారం సత్తయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

జీఓ 51 సవరణ, మల్టీపర్పస్ విధానం రద్దు, జీతాల పెంపు, ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె 6వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండలకేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. గ్రామాల్లో పరిశుద్ధ్య పనులు చేస్తున్న జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదన్నారు. ఆయా కార్యక్రమాల్లో సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

– జనగామ రూరల్/నర్మెట/తరిగొప్పుల/లింగాలఘణపురం/కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/జఫర్‌గఢ్/రఘునాథపల్లి/బచ్చన్నపేట



జనగామ రూరల్: అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న జిల్లా జేఏసీ చైర్మన్ రాపర్తి రాజు



లింగాలఘణపురం: అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న కార్మికులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో..



నర్మెటలో..

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో

చిల్పూరు/లింగాలఘణపురం: రాష్ట్రంలో ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నపెండ్యాల జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు చిన్నపెండ్యాలలో పార్టీ మండల, గ్రామ శాఖ అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఇల్లందుల హరిబాబు ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, ఎంపీటీసీ ఉమ, రవి, యాదగిరి, రంజిత్‌రెడ్డి, తీగల మహేందర్, వెన్నం మాధవరెడ్డి, రవీందర్, శ్రీను పాల్గొన్నారు. అలాగే లింగాలఘణపురం మండలంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ సంపత్, నాయకులు బాగ్యలక్ష్మి, శ్రీశైలం, రాహుల్, మధు పాల్గొన్నారు.



నిరసనలో జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

కన్నాయపల్లికి బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

రఘునాథపల్లి: మండలంలోని కన్నాయపల్లికి ఆర్టీసీ అధికారులు మంగళవారం బస్సు సర్వీస్ సేవలు ప్రారంభించారు. మొదటి సారిగా గ్రామానికి వచ్చిన బస్సు ముందు సర్పంచ్ గందమాల నర్సింహ, ఎంపీటీసీ రచ్చ సోమనాథ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు చేసి సర్వీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి డిపో మేనేజర్ జ్యోత్స్న స్పందించి గ్రామానికి బస్సు సర్వీసు సేవలు కొనసాగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి తొలిసారి బస్సు సర్వీసు ప్రారంభం కావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, బీబీఎస్ రెడ్డి, గ్రామ ఆర్టీసీ అధికారి బైరపాక యాదగిరి, గైని శ్రీనివాస్, పగిడిపల్లి కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం

- చర్య తీసుకోవాలని ఎంపీఓకు గ్రామస్తుల ఫిర్యాదు

రఘునాథపల్లి: రఘునాథపల్లి మండల కేంద్రంలో 10వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే తొలగించి చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు ఎంపీఓకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎంపీఓ వెంకటేశ్వర్లును కలిసిన వారు నాగేష్ అనే వ్యక్తి గ్రామంలోని ప్రధాన రహదారిని ఆక్రమిస్తు ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, గతంలో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తే పనులు నిలిపివేశారని చెప్పారు. మూడు నెలల అనంతరం తిరిగి పనులు ప్రారంభించిన నాగేష్, కార్యదర్శి ఇచ్చిన అనుమతితో నిర్మిస్తున్నట్లు చెబుతున్నాడన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డును ఆక్రమించి చేపడుతోన్న నిర్మాణాన్ని తొలగించి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎంపీఓ వెంటనే అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ విషయమై వెంకటేశ్వర్లును వివరణ కోరగా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నిర్మాణాన్ని పరిశీలించగా రెండు ఫీట్ల మేర రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం జరగుతున్నట్లు గుర్తించామన్నారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించినట్లు ఎంపీఓ తెలిపారు. ఎంపీఓకు వినతి పత్రం అందించిన వారిలో ఉప సర్పంచ్ యాద రాములు, మర్కాల వెంకట్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కావటి యాదగిరి ఉన్నారు.



ఎంపీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఘనంగా 'పల్లా' జన్మదిన వేడుకలు



చిల్పూరు: పూజ చేయిస్తున్న శ్రీధర్‌రావు



స్టేషన్‌ఘన్‌పూర్: అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

చిల్పూరు/స్టేషన్‌ఘన్‌పూర్/లింగాలఘనపురం/రఘునాథపల్లి/జఫర్‌గఢ్: రాష్ట్ర రైతు బంధు చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిల్పూరు ఆలయంలో నిర్వహించిన పూజలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు. పల్లా జన్మదినాన్ని పురస్కరించుకుని చిల్పూరు ఆలయంలో, గుట్ట కింద ఉన్న ఎల్లమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీధర్ రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కాగా, పల్లా పుట్టినరోజు సందర్భంగా అమ్మఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన మనికుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. లింగాలఘణపురం మండలంలో జరిగిన పల్లా జన్మదిన వేడుకల్లో ఎంపీపీ చిట్ల జయశ్రీ పాల్గొని మాట్లాడారు. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీఫాం ఇచ్చి గెలిపించిన నాయకునికే నేడు కొందరు వెన్నుపోటు పొడవడం బాధాకరమని ఆమె అన్నారు. రఘునాథపల్లి, జఫర్‌గఢ్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్‌కు డీవైఎఫ్ఐ మద్దతు

జనగామ రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల పాఠశాలల బంద్‌కు డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ పూర్తి మద్దతు ఇస్తుందని జిల్లా కార్యదర్శి దూసరి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణ కార్యదర్శి వినోద్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నేటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయలేదని అన్నారు. కనకచారి, సాయి, విష్ణు, నరేష్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని రామాలయం వీధి సమీపాన రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ లైన్ ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం అత్యంత ప్రమాదకరంగా ఉందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు గట్టు కృష్ణ అన్నారు. కాలనీ వాసులతో కలిసి ఆయన మంగళవారం కాలనీని సందర్శించారు. రోడ్డు మధ్య నుంచి విద్యుత్ స్తంభాన్ని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పిట్టల యాదగిరి, పిట్టల అనీల్, నీల రాజయ్య, విజయమ్మ, తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న కొమ్మూరి

జనగామ: పట్టణంలో ఇటీవల మృతిచెందిన పలువురు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ సభ్యుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. 1వ వార్డు మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి వెంకటరత్నం తల్లి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను కొమ్మూరి పరామర్శించారు. 22వ వార్డు సాయినగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మైసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. అలాగే జనగామ మున్సిపల్ మొదటి చైర్మన్ వెన్నం వెంకట నరసింహారెడ్డి మనవరాలు ఇటీవల చనిపోగా కుటుంబ సభ్యులను ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు చారబుడ్ల దయాకర్ రెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, రాముగల్ల అరుణ విజయ్, బాల్దె ఆంజనేయులు, మోటే శ్రీనివాస్, ఆలేటీ సిద్ది రాములు, నర్సింగ రావు, పిట్టల సతీష్, ఆకుల లక్ష్మయ్య, జాయ మల్లేష్, కడారు ప్రవీణ్, మల్లేశ్, సత్యనారాయణ, దాసరి క్రాంతి, ప్రవర్దన్, రాజు, ప్రకాష్ ఉన్నారు.

శ్రీనివాస్‌జీ సేవలు మరువలేనివి

దేవరుప్పుల: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం అన్నారు. మంగళవారం మండలంలోని కడవెండిలో మాజీ సర్పంచ్ అస్నాల శ్రీనివాస్‌జీ వర్ధంతి పురస్కరించుకొని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్మారక స్తూపానికి ఘననివాళులర్పించారు. ఉద్యమాల గడ్డలో వామపక్షభావజాల సిద్ధాంతాలకు లోబడి పడమటితోట స్థలాన్ని పేదలకు దారాదత్తం చేశారని, నక్సల్స్ ప్రభావిత పరిస్థితుల్లో గ్రామాన్ని అన్ని విధాలుగా పరిరక్షించుకుంటూ అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన శ్రీనివాస్‌జీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అస్నాల ఆగమ్మ, అనిత, పాలకుర్తి ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, కొడకండ్ల మార్కెట్ చైర్మన్ పేరం రాము, ప్రజాప్రతినిధులు బెల్లీనాలీ నారెడ్డి, యాకాంతరావు, మదార్, నగేష్, రైతు బంధు మండల కన్వీనర్ నర్సింహ్మారెడ్డి, రిటైర్డ్ ఎస్సై సమ్మిరెడ్డి, రవి, మహేష్, హన్మంతు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దేవరుప్పుల: జాతీయస్థాయి ప్లాస్టిక్ రహిత దినోత్సవం(ఈనెల20) పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతి విద్యార్థులకు 'సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలి' అనే అంశంపై రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గోశాల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, సమాఖ్య అధ్యక్షుడు జి.రాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలనే సంకల్పానికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని కోరారు. ఆయా హైస్కూల్‌లో ఎంట్రీ విజేతను జిల్లాస్థాయి పరిగణలోకి తీసుకొని స్క్రీనింగ్ చేసి రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకుంటామన్నారు. ఈ వ్యాసరచన తెలుగు భాషలో ఉంటుందనీ, ఎంట్రీల సంఖ్యను బట్టి విద్యార్థులకు ప్రోత్సాహకాలు, పాఠశాలలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేస్తామన్నారు. వివరాల కోసం 9394005600లో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా 'సీత్లా పండుగ'

కొడకండ్ల: సీత్లా పండుగను మంగళవారం మండలంలోని గిరిజనులు వైభవంగా జరుపుకొన్నారు. సీత్లా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశుసంపద బాగుండాలని, తమ ఆరోగ్యాలు బాగుండాలని గిరిజనులు పూజలు నిర్వహించారు. గిర్నితండాలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ రాజేకుమార్‌లు పాల్గొనగా నూతన గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఎంపీటీసీలు గిరిజనులతో వేడుకలను నిర్వహించుకొన్నారు.



సీత్లా పండుగ వేడుకల్లో ఎంపీపీ జ్యోతి

సంక్షిప్త సమాచారం

భద్రకాళి సన్నిధిలో అడిషనల్ కలెక్టర్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ దంపతులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ స్వపన మండిరంలో వేదపండితులు మహాదాశీర్వచనం చేశారు. పూజా కార్యక్రమాలను ఈఓ. శేషభారతి పర్యవేక్షించారు.

కొనసాగుతున్న స్వీపర్ల సమ్మె

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. సమ్మె మంగళవారం నాటికి 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజయ్య దీక్షను ప్రారంభించి మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో స్వీపర్ల కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారని అన్నారు. టైమ్‌స్కేల్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

ఎన్నిక

దేవరుప్పుల: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చింత గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ విభాగం జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల సత్యం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు బసవగళ్ల సిద్ధయ్య పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బహుజనుల రాజ్యాధికారం కోసం, బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని రఘునాథ్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం, కోడిగుడ్లను మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీటీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్ శ్రీదేవి పెద్దిరెడ్డి అందజేశారు.

ఆర్థికసాయం



దేవరుప్పుల : మండలంలోని మాదాపురానికి చెందిన బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు బెజగం ఐలమ్మ భర్త ఎల్లయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల నాయకుడు పల్లా సుందర్‌రామిరెడ్డి పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ గుర్రం స్రవంతి, బస్వ మల్లేశం, క్రాంతి, చింత రవి, కృష్ణమూర్తి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్లెంలో..

లింగాలఘణపురం: మండలంలోని కల్లెం గ్రామానికి చెందిన మారపాక లక్ష్మీనారాయణ గుండెపోటుతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా మంగళవారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆయనను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

జనగామ రూరల్: నూతన పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన వారు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ తలారి మల్లేష్ అన్నారు. మంగళవారం ఓబుల్‌కేశావపూర్ రైతు వేదికలో గ్రామస్తుల నుంచి బీమా దరఖాస్తులు స్వీకరించారు.

రైతులందరికీ రుణాలు ఇవ్వాలి

జఫర్‌గఢ్: రైతులందరికి పంట రుణాలు ఇవ్వాలని రైతు సంఘం నాయకులు, రైతులు కోరారు. ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, నాయకులు నక్క యాకయ్య, కాట సుధాకర్, వేల్పుల పెద్ద రాములు, నీరటి కొంరయ్య పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

దేవరుప్పుల: మండలంలోని కోలుకొండలో ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి కన్న పరుశరాములు అనే గీత కార్మికుడికి మంగళవార తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని తోటి కార్మికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పంట పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

తరిగొప్పుల: అదుపుతప్పి ఇన్నోవా కారు పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండల పరిధిలో జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. మద్దూరు మండలం లద్నూర్ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు నర్మెట మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్‌ను తిలకించేందుకు వచ్చారు. అక్కడ సరదాగా గడిపిన అనంతరం వ్యక్తిగత పనినిమిత్తం హుస్నాబాద్ వెళ్తున్నారు. ఈ క్రమంలో అక్కరాజుపల్లి క్రాస్‌రోడ్ సమీపంలోని మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

అక్రమ నిర్మాణలపై చర్యలేవి ?

పట్టించుకోని అధికారులు

జనగామ రూరల్: మండలంలోని యశ్వాంతాపూర్‌లో ఎలాంటి జీపీ అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. పెద్దఎత్తున యశ్వంతాపూర్ హైవే పక్కన ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపడుతున్నారు. పర్మిషన్ లేదని గ్రామస్తులు తెలిపినా అధికారులు కంటి చూడుపు చర్యగా నోటీస్‌లకు మాత్రమే పరితమయ్యారు. మొదటిసారి నోటీస్ అందించినా నిర్మాణాలు ఆగపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు చొరవతీసుకొని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి ప్రభుత్వ ఆస్తులు కాపాడలని పలువురు కోరుతున్నారు.



యశ్వంతాపూర్ హైవేపై చేపట్టిన నిర్మాణాలు

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



బచ్చన్నపేట: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని మాజీ జెడ్పీటీసీ వేముల స్వప్నసాగర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లి, కేసిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, డ్రాయింగ్, నోట్ బుక్స్ తదితరాలను ఉచితంగా అందజేశారు.

అవగాహన ర్యాలీ

తరిగొప్పుల: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు రాధలత, సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఎంపీఓ అలాం, మండల పరిషత్ సూపరింటెండెంట్ దేవేందర్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం వసంత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పండ్ల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలోకి రోగులకు, ఆశ కార్యకర్తలకు మంగళవారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు యువాన్‌జాన్ మాట్లాడుతూ ప్రస్తుతం జనాభాలో దేశం ప్రథమ స్థానంలో ఉందని, చిన్న కుటుంబం చింతలు లేని కుంటుంబం అన్నారు. జనాభా నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం జీపీ కార్మికులకు సమ్మె శిబిరం వద్ద క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ జోన్ చైర్మన్ మధుసూదన్, క్లబ్ కార్యదర్శి నిర్మల, మంజుల ఉన్నారు.



పండ్లు పంపిణీలో క్లబ్ బాధ్యులు